## త్వరలోనే రాహుల్ డూప్ వివరాలు వెల్లడిస్తా

- అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ

గువాహటి, జనవరి 28: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయ యాత్రలో రాహుల్ గాంధీ డూప్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తానని హిమంత తెలిపారు. రాహుల్ డూప్ పేరేంటి, అతని చిరునామా, అతడిని ఎందు కు, ఎలా వినియోగిస్తున్నారు తదితర వివరాలన్నీ త్వరలోనే తెలియజేస్తానని, దీనికి కొన్ని రోజులు ఆగాలని విజ్ఞప్తి చేశారు. తాను రెండు రోజుల పర్యటన నిమిత్తం డిబ్రూగర్ వెళ్తున్నానని, అక్కడి నుంచి వచ్చిన వెంటనే వివరాలు తెలియజేస్తానని చెప్పారు. కాగా, రాహుల్ గాంధీ పోలికలతో ఉన్న వ్యక్తిని ఆయన తన భారత్ జోడో న్యాయ యాత్రలో తనకు బదులుగా ఉంచుతున్నారని ఇటీవల హిమంత ఆరోపించిన విషయం తెలిసిందే.



## ప్రపంచ కుబేరుడిగా మళ్లీ బెర్నార్డ్

### మస్క్‌ని నెట్టి మొదటి స్థానానికి

శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 28: ప్రపంచంలోని అత్యంత ధనవంతుల జాబితాలో లగ్జరీ వస్తువుల కంపెనీ ఎల్‌వీఎంహెచ్ చైర్మన్, సీఈవో బెర్నార్డ్ ఆర్నాల్ట్ (74) మరోసారి మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. ఇప్పటివరకు ఆ స్థానంలో ఉన్న స్పేస్ ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని బెర్నార్డ్ దక్కించుకున్నట్టు ఫోర్బ్స్ వెల్లడించింది. ఆర్నాల్ట్, ఆయన కుటుంబం ఆస్తి ఈ ఏడాది 23.6 బిలియన్ డాలర్లు పెరిగి 207.8 బిలియన్ డాలర్లుకు చేరుకోగా, మస్క్ సంపద 204.5 బిలియన్ డాలర్లుగా నమోదైంది. బెర్నార్డ్ మొదటిసారి 2022లో కూడా మస్క్‌ను అధిగమించి తొలి స్థానాన్ని దక్కించుకున్నారు.

# కార్పొరేషన్ పదవి ఎవడిక్కావాలి!

## ఇస్తే గిస్తే క్యాబినెట్ మినిస్టర్ పోస్టులు ఇవ్వాలి

- అధిష్ఠానానికి కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల హుకుం
- అదను కోసం కాచుకొని కూర్చున్న ప్రతిపక్ష బీజేపీ
- 'ఆపరేషన్ లోటస్'పై హస్తం పార్టీ నేతలకు బుగులు

బెంగళూరు, జనవరి 28: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి నామినేటెడ్ పోస్టులు పెద్ద తలనొప్పిగా మారాయి. బోర్డు పదవులు అప్పగిస్తే 'మాకేం వద్దుపో' అని అధిష్ఠానానికి తేల్చిచెప్తున్నారు. కొందరైతే 'మాకు కార్పొరేషన్ పదవులా? ఇస్తే గిస్తే క్యాబినెట్ మినిస్టర్ స్థాయి పోస్టులు ఇవ్వాలి. గీ పోస్టులు మాకెందుకు?' అని స్పష్టం చేస్తున్నారు. దీంతో వారిని బుజ్జగించేందుకు హస్తం పార్టీ పెద్దలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సరైన సమయం అని.. ప్రతిపక్ష బీజేపీ అదను కోసం చూస్తున్నది. కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతున్నది? అని ఓ కన్నేసి ఉంచింది. దీంతో హస్తం పార్టీ పెద్దలకు మరింత తలనొప్పిగా మారింది. 'ఆపరేషన్ లోటస్' అంటూ రంగంలోకి దిగితే అసమ్మతి ఎమ్మెల్యేలు జంప్ అవుతారేమోనని తలలు పట్టుకుంటున్నారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు ఉత్తర కర్ణాటక ప్రాంతంలో 10 మందికి పైగా ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో చాలా మంది ప్రముఖులే. వీరంతా నామినేటెడ్ పోస్టుల పట్ల అసహనంతో ఉన్నారు. కాగా, జనవరి 26న ఆ రాష్ట్ర ప్రభుత్వం 34 బోర్డులు, కార్పొరేషన్లకు బాస్‌లను నియమించింది. త్వరలో మరో 45 బోర్డులు, కార్పొరేషన్లకు కూడా నియమించేందుకు సిద్ధమవుతున్నది.

### గ్యారెంటీల ఎఫెక్ట్.. నిధులకు డిఫెక్ట్

నామినేటెడ్ పోస్టులు తీసుకోకపోవటానికి వెనుక పెద్ద కారణం ఉన్నట్టు తెలుస్తున్నది. ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉన్న డబ్బునంతా తీసుకెళ్లి



గ్యారెంటీల అమలుకే ఖర్చు పెడుతున్నది. దీంతో కార్పొరేషన్లకు చిల్లి గవ్వ కూడా రాదని, అలాంటప్పుడు ఇంకెందుకు ఆ పోస్టులు అని తెగేసి చెప్తున్నారు. మరోవైపు, పార్టీ నేతల కామెంట్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండలా మారాయి. లోక్‌సభ ఎన్నికల్లో యెడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర శివమొగ్గలో బీజేపీ ఎంపీగా మళ్లీ గెలుస్తారని పార్టీ సీనియర్ నేత శమనూర్ శివశంకరప్ప చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. దీంతో కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రంగంలోకి దిగి, నష్టాన్ని నియంత్రించే పనిలో పడ్డారు.

### సీఎం సీటు కోసం డీకే పాట్లు

ప్రస్తుత కార్పొరేషన్ నియామకాల్లో సీఎం సిద్ధరామయ్యదే పైచేయిగా నిలిచింది. అయితే, లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎలాగైనా సీఎం సీటును దక్కించుకోవాలని చూస్తున్న డీకే శివకుమార్.. ఆ దిశగా తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో అధిక సీట్లు గెలిచి పార్టీ అధిష్ఠానం ముందు తన బలాన్ని నిరూపించుకునే పనిలో పడ్డారు. ఎన్నికలు ముగిసే వరకు పార్టీలో ముసలాన్ని నియంత్రించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

### ఎన్నికల తర్వాత ఆపరేషన్ లోటస్?

కర్ణాటక కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలను బీజేపీ దగ్గరుండి గమనిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తర్వాత అధికార కాంగ్రెస్‌ను గద్దె దించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే, ఆపరేషన్ లోటస్ లాంటి ఏ ప్రయత్నాలూ చేయటం లేదని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర చెప్పటం గమనార్హం. అయితే, రాజకీయ నాయకులు చేసేదేదైనా చెప్తారా ఏంటి? అని కాంగ్రెస్ సన్నిహిత వర్గాలు మాత్రం ఆ పార్టీని హెచ్చరిస్తున్నట్టు తెలుస్తున్నది. 2019లో జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవటంలో విజయేంద్ర కీలక పాత్ర పోషించారన్న విషయాన్ని గుర్తు చేస్తున్నట్టు సమాచారం. మహారాష్ట్రలో శివసేన-ఎన్సీపీ-కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ చాలా రోజుల క్రితమే పని ప్రారంభించి, సక్సెస్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఎప్పుడేం జరుగుతుందో? అని ఇరు వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## • మోనాలిసాపై సూప్



*తమ డిమాండ్ల సాధన కోసం కొన్ని రోజులుగా ఫ్రాన్స్ రైతులు నిరసనలు చేపడుతున్నారు. వారికి మద్దతుగా కొందరు పర్యావరణ కార్యకర్తలు పారిస్‌లోని లౌవ్రే మ్యూజియంలో ఉన్న ప్రఖ్యాత 'మోనాలిసా' పెయింటింగ్‌కు రక్షణగా ఉన్న గాజు అద్దంపై సూప్ జల్లారు. 'ఫుడ్ రిపోజిట్' అని ముద్రించిన టీ-షర్ట్‌లను ధరించిన ఇద్దరు మహిళలు ఈ విధంగా తమ నిరసన తెలిపారు. 'అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటి? కళలు ముఖ్యమైనవా? లేదంటే, ఆరోగ్యకరమైన, సుస్థిరమైన ఆహారాన్ని పొందే హక్కు ముఖ్యమైనదా? మన వ్యవసాయ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. రైతులు పని చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు' అని ఆ మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.*

## 'సహేలీ' రూపకర్త నిత్యానంద్ కన్నుమూత



లక్నో: నోటి ద్వారా తీసుకునే గర్భ నిరోధక మాత్ర 'సహేలీ'ని తయారుచేసిన శాస్త్రవేత్త, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ నిత్యానంద్ (99) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. సెంట్రల్ డ్రగ్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను 1951లో ఏర్పాటు చేసినప్పటి నుంచి డాక్టర్ నిత్యానంద్‌కు ఆ సంస్థతో అనుబంధం ఉంది. ఆయన 1974 నుంచి 1984 వరకు ఆ సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. 400కుపైగా రిసెర్చ్ పేపర్లను ప్రచురించారు, 100 మంది పీహెచ్‌డీ విద్యార్థులను పర్యవేక్షించారు. 130కిపైగా పేటెంట్లను సాధించారు. నిత్యానంద్ అభివృద్ధి చేసిన సహేలీ గర్భనిరోధక మాత్రలను జాతీయ కుటుంబ నియంత్రణ పథకంలో 2016లో చేర్చారు. ఇది సురక్షితమైనది కావడంతో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. ఆయన కేంద్ర ప్రభుత్వానికి చెందిన అనేక డ్రగ్ పాలసీ రూపకల్పన సంస్థల కోసం నాలుగు దశాబ్దాలకుపైగా పని చేశారు.



## మాల్దీవులు పార్లమెంట్‌లో బాహాబాహీ

మాలె, జనవరి 28: మాల్దీవుల పార్లమెంట్‌లో ఇద్దరు ప్రజాప్రతినిధులు బాహాబాహీకి దిగడం సంచలనం సృష్టించింది. అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు క్యాబినెట్‌లోకి నలుగురు మంత్రుల చేరికకు పార్లమెంట్ ఆమోదం పొందడానికి ప్రత్యేకంగా జరిగిన సమావేశంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. అధికారంలో భాగస్వాములైన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పీఎన్‌సీ), ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ మాల్దీవులు ఎంపీలు, విపక్ష మాల్దీవన్ డెమోక్రాటిక్ పార్టీ (ఎండీపీ) ఎంపీల మధ్య ఏర్పడిన వివాదం ఈ ఘర్షణకు దారితీసింది.

విపక్షానికి చెందిన ఎంపీలు పార్లమెంట్ ఛాంబర్‌లోకి ప్రవేశించకుండా కొందరు అధికార ఎంపీలు అడ్డుకున్నారు. ఎండీపీ సభ్యులు మయిజ్జు క్యాబినెట్‌లోకి నలుగురు సభ్యులకు ఆమో దం తెలపడానికి నిరాకరించడంతో ఈ ఘర్షణ చోటుచేసుకున్నట్టు అధాన్ వెల్లడించింది.




## చేతిరాత మెదడుకు మేత!

### టైపింగ్ కంటే మెరుగైనది: పరిశోధకులు

*జనవరి 28, లండన్: మీ మెదడును చురుగ్గా ఉంచుకోవాలనుకుంటున్నారా? అయితే ఏదైనా కంటెంట్‌ను టైపింగ్ చేసే బదులు చేత్తో రాయండి. 'కీ బోర్డ్ మీద టైపింగ్‌తో పోలిస్తే చేత్తో రాస్తున్నప్పుడు మెదడు అనుసంధానం మరింత విస్తృతంగా ఉంది. ఇలాంటి అనుసంధానం జ్ఞాపకశక్తికి, కొత్త సమాచారాన్ని విశ్లేషించడానికి కీలకం. నేర్చుకొనేందుకు ప్రయోజనకరం' అని నార్వేజియన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఆడ్రీ వన్ డెర్ మీర్ తెలిపారు. చేతిరాత, టైపింగ్‌లో ఉన్న నాడీ సంబంధమైన నెట్‌వర్క్‌ను పరిశీలించిన అనంతరం పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు.*

## కుంచించుకుపోతున్న చంద్రుడు!

### భవిష్యత్తులో వ్యోమగాములకు కష్టమే!



*న్యూయార్క్, జనవరి 28: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) చంద్రుడిపై వ్యోమగాములను పంపేందుకు ఆర్టెమిస్-3 మిషన్‌ను 2026లో ప్రయోగిస్తామని ప్రకటించింది. 1972లో అపోలో 17 తర్వాత ఈ మిషన్ ద్వారానే మనుషులను జాబిల్లిపైకి పంపేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో ప్లానెటరీ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం నాసాకు సవాల్‌గా మారింది. చంద్రుడు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాడని, దక్షిణ ధ్రువంపై ప్రకంపనాల వల్ల ఉపరితలం పూర్తిగా గుంతలమయంగా తయారైందని పరిశోధకులు తేల్చారు. ఆర్టెమిస్‌ను నాసా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దించాలని ప్రణాళిక రచించిందని, అయితే చంద్రుడిపై ప్రకంపనల వల్ల కొండచరియలు విరిగిపడుతున్నాయని, ఇక్కడ చాలా భాగం సేఫ్ ల్యాండింగ్‌కు అనుకూలంగా లేదని అధ్యయనంలో తేలింది. చంద్రుడిపై జరుగుతున్న ఈ పరిణామాలు భవిష్యత్తులో వ్యోమగాములకు సమస్యలు తెచ్చిపెడతాయని హెచ్చరించింది.*

## 5 వేల ఏండ్ల కిందటే వైవిధ్య వంటకాలు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

*హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): జర్మనీకి చెందిన కీల్ విశ్వవిద్యాలయం పరిశోధకులు రాతి యుగంలో మనుషులు ఎలాంటి ఆహారం తిన్నారన్న దానిపై పరిశోధనలు చేసి అబ్బురపరిచే విషయాలను కనుగొన్నారు. 5 వేల సంవత్సరాల క్రితం రాతి యుగంలో మనుషులు వైవిధ్యమైన వంటలు వండుకొని తినేవారని, ఇందు కోసం సిరామిక్ పాత్రలను ఉపయోగించినట్లు తెలుసుకున్నారు. వాటిలో కాలిన ఆహార పదార్థాల అవశేషాలు కనుగొన్నారు. జర్మనీలోని తూర్పు హోల్‌స్టెయిన్‌లో ప్రజలు ఆ కాలంలో ఏం తినేవారు? ఎలా తినేవారు? అనే విషయాలపై పరిశోధన చేసి ఆ వివరాలను ప్లాస్ వన్ జర్నల్‌లో ప్రచురించారు. ఆనాటి ప్రజలు మొక్కల ఆధారిత, వివిధ తృణ ధాన్యాలను ఆహారంగా స్వీకరించారని తెలిసింది.*

---

చిత్రం



## 'దేవర' వచ్చేది అప్పుడేనా?

*ఎన్టీఆర్ 'దేవర' రిలీజ్ డేట్ విషయం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. కొరటాల శివ దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో భారీ హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. విజువల్స్ అత్యున్నత ప్రమాణాలతో కనిపించాయి. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారం తొలి భాగం ఏప్రిల్ 5న విడుదల కావాల్సి ఉంది. అయితే ప్రతినాయకుడిగా నటిస్తున్న సైఫ్‌అలీ ఖాన్ ఇటీవల ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స చేయించుకోవడం, గ్రాఫిక్స్ కోసం మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో ఈ సినిమా విడుదల వాయిదా పడనుందనే వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'దేవర' విడుదల ఎప్పుడనే విషయం అభిమానుల్లో ఉత్సుకతను పెంచుతున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా దసరా బరిలో విడుదల కాబోతున్నదని తెలిసింది. అయితే రిలీజ్ డేట్ విషయంలో ఇప్పుడొస్తున్న వార్తలన్నీ కేవలం ఊహాగానాలేనని, చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటనతోనే స్పష్టత వస్తుందంటున్నారు.*

## చివరకు మిగిలేది కళ మాత్రమే



అర్జున్‌సాయి, దిలీప్‌ప్రకాష్, ఎల్‌బీ శ్రీరామ్, బ్రహ్మానందం, ఏ.ఎం.రత్నం, సురేష్ పాటిల్

'నటీనటులు.. వారి తాలూకు జీవితంతో నాకు ఓ భావోద్వేగభరితమైన అనుబంధం ఉంది. ఆర్ట్ ఈజ్ లాంగ్. లైఫ్ ఈజ్ షార్ట్. చివరి వరకూ మిగిలిపోయేది కళ మాత్రమే' అన్నారు ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందం. ఆదివారం హైదరాబాద్‌లో 'ఉత్సవం' చిత్ర టీజర్ ఆవిష్కరణ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దిలీప్ ప్రకాష్, రెజీనా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అర్జున్ సాయి దర్శకుడు. సురేష్ పాటిల్ నిర్మించారు. 'కళాకారుడు చనిపోవచ్చుగానీ కళ చనిపోకూడదు' అంటూ ప్రకాష్‌రాజ్ వాయిస్ ఓవర్‌తో టీజర్ ఆద్యంతం ఎమోషనల్‌గా సాగింది. టీజర్ విడుదల అనంతరం బ్రహ్మానందం మాట్లాడుతూ 'ఇలాంటి సినిమాలు చేయాలంటే ధైర్యంతోపాటు కథను సినిమాటిక్‌గా చెప్పే నేర్పు కావాలి. ఇంత మంది నటీనటులతో సినిమాను అద్భుతంగా తీశారు. ఇదొక ఉత్సవంలా ఉంటుంది' అన్నారు. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని దర్శకుడు అర్జున్ సాయి తెలిపారు. బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, రాజేంద్రప్రసాద్, నాజర్, అలీ, ప్రేమ, ఎల్‌బీ శ్రీరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: అనూప్ రూబెన్స్, రచన-దర్శకత్వం: అర్జున్ సాయి.



**తెలుగు సినీ నిర్మాతలు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దిల్‌రాజు, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, సెక్రటరీ అనుపమ్ రెడ్డి, నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదరప్రసాద్, నిర్మాతలు పీవీ రవికిషోర్, బాపినీడు, సుప్రియ తదితరులున్నారు.**

## వెంటాడే యుద్ధం 'ధీర'



లక్ష్ చదలవాడ హీరోగా నటిస్తున్న చిత్రం 'ధీర'. విక్రాంత్ శ్రీనివాస్ దర్శకుడు. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర పతాకంపై పద్మావతి చదలవాడ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. మాస్, యాక్షన్, ఎమోషన్ అంశాలతో ట్రైలర్ ఇంట్రెస్టింగ్‌గా సాగింది. 'ఈ మనిషి బ్రెయిన్ ఉంది చూడు.. అది వెరీ డేంజరస్. నేను యుద్ధం చేయడం కాదు.. యుద్ధమే మిమ్మల్ని వెంటాడుతూ వేటాడుతూ వస్తోంది..' అనే డైలాగ్స్ హీరో క్యారెక్టరైజేషన్‌ను ఆవిష్కరించాయి. హీరో లక్ష్ యాక్షన్ సన్నివేశాల్లో ఆకట్టుకున్నాడు. నేహ పఠాన్, సోనియా బన్సాల్, మిర్చి కిరణ్, హిమజ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కన్నా పీసీ, సంగీతం: సాయికార్తీక్, సమర్పణ: చదలవాడ బ్రదర్స్, రచన-దర్శకత్వం: విక్రాంత్ శ్రీనివాస్.

## విజయాన్ని ఊహించాను!

'యానిమల్' చిత్రంలో జోయాగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు కథానాయిక త్రిప్తి డిమ్రీ. ఈ సినిమాతో ఒక్కసారిగా పాపులర్ అయిపోయిందీ అమ్మడు. 'యానిమల్' తర్వాత ఈ ఢిల్లీ భామకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ సంఖ్య అమాంతం పెరిగిపోయింది. రణబీర్ కపూర్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రంలో రష్మిక కథానాయిక కాగా, త్రిప్తి డిమ్రీ జోయా పాత్రలో అలరించింది. తాజాగా ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న త్రిప్తి 'యానిమల్' విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ తన కెరీర్ గురించి చెప్పుకొచ్చింది. 'సినీ పరిశ్రమలో ప్రయాణం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎత్తుపల్లాలు సహజం. ప్రతి దాని నుంచీ పాఠాలు నేర్చుకోవాలి. నా కెరీర్ విషయంలో ఎప్పుడూ బాధపడలేదు. 'యానిమల్'తో నాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సినిమా సూపర్ హిట్ అని ముందే ఊహించా. కాకపోతే నా పాత్రకు ఇంతటి పాపులారిటీ వస్తుందని అస్సలు అనుకోలేదు. నా జీవితంలో ప్రత్యేకమైన క్షణాలివి. రోజూ నిద్రపోయే ముందు చిత్రబృందాన్ని గుర్తుచేసుకొని థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. నన్ను ఆదరించిన ప్రేక్షకులకు కూడా ఎప్పుడూ కృతజ్ఞురాలినే' అంటూ భావోద్వేగానికి గురైంది. మరోవైపు ఈ సొగసరి తెలుగులోనూ అవకాశాల కోసం అన్వేషిస్తోందనేది టాలీవుడ్ టాక్. విజయ్ దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి కాంబో ప్రాజెక్టులో హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసే అవకాశం లేకపోలేదని ప్రచారం జరుగుతోంది.




త్రిప్తి డిమ్రీ



## అఘోర పాత్రలో విశ్వక్‌సేన్


విశ్వక్‌సేన్ హీరోగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో తెరకెక్కుతున్న అడ్వెంచర్ డ్రామా 'గామి'. కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్ పతాకంపై శబరీష్ నిర్మిస్తున్నారు. చాందిని చౌదరి కథానాయిక. ఫస్ట్‌లుక్‌ను ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అఘోరా గెటప్‌లో విశ్వక్‌సేన్ లుక్ ఆశ్చర్యపరిచేలా ఉంది. చుట్టూ చాలా మంది అఘోరాలు ఆయన్ను తాకడానికి ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్న ఈ పోస్టర్ భయకరంగా కనిపిస్తున్నది. విశ్వక్‌సేన్ ఈ చిత్రంలో శంకర్ అనే అఘోరాగా కనిపించనున్నారు. విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: విశ్వనాథ్‌రెడ్డి, సంగీతం: నరేశ్ కుమారన్, నిర్మాత: కార్తీక్ శబరీష్, దర్శకత్వం: విద్యాధర్ కాగిత.

## హనుమంతుడిగా సన్నీ డియోల్



బాలీవుడ్ దర్శకుడు నితేశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న రామాయణం చిత్రంలోని ముఖ్యమైన పాత్రల్లో హనుమంతుడి క్యారెక్టర్ ఒకటి. ఈ పాత్రను సన్నీ డియోల్ పోషించనున్నట్లు సమాచారం. కొంత కాలంగా ప్రచారంలో ఉన్న ఈ ప్రాజెక్టు గురించి తాజా అప్‌డేట్ సినీ ప్రియుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. భారతీయ ఇతిహాస గాథ రామాయణం నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శ్రీరాముడి పాత్రను రణబీర్ కపూర్ పోషిస్తుండగా, సాయిపల్లవి సీతగా కనిపించనున్నారు. రావణుడిగా యష్, కైకేయిగా లారాదత్తా నటించనున్నారు. రావణుడి సోదరుడు విభీషణుడి పాత్ర కోసం తమిళ నటుడు విజయ్ సేతుపతితో మేకర్స్ చర్చలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తున్నది. మిగతా పాత్రలు సైతం త్వరలో ఖరారు కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. భారతీయ ఇతిహాసానికి జీవం పోసే ప్రయాణం వచ్చే మార్చిలోనే ప్రారంభించనున్నట్లు తెలుస్తున్నది. రామాయణం చిత్రీకరణ మొదటి భాగం మే నుంచి జూలై వరకు ఉంటుందని వినికిడి. ఈ తొలి విడత షూటింగ్‌కు సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ ప్రక్రియకు ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది.

## 'భ్రమయుగం' రహస్యం



మలయాళ అగ్ర నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'భ్రమయుగం'. రాహుల్ సదాశివన్ దర్శకుడు. రామచంద్రం, ఎస్.శశికాంత్ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఫిబ్రవరి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ థ్రిల్లర్ కథాంశమిది. ఓ కాల్పనిక ప్రపంచంలో కథ జరుగుతుంది. భ్రమయుగం వెనకున్న రహస్యమేమిటనేది ఆసక్తికరమైన అంశం. భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం' అన్నారు.